నట్టేట ముంచిన వాన

- దెబ్బతిన్న పంటలు
- రైతులకు అపార నష్టం
- మొక్కుబడిగా అధికారుల పరిశీలన

బూర్గంపాడు: మిచాంగ్ తుపాన్‌తో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. రెండు రోజులపాటు కురిసిన భారీ వర్షాలకు వరి,పత్తి, మిర్చి, అపరాల పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. భారీ వర్షానికి పంటలు నీటమునిగాయి. మూడురోజులుగా వరిపంట నీటి మునకలోనే ఉన్నాయి. వరి మాగాణులలో నీటిని బయటకు తీసేందుకు రైతులు నానా తిప్పలు పడుతున్నారు. లోతట్టు మాగాణులలో నీరు బయటకు వెళ్లకపోవటంతో రైతులు ఇంజన్లు, మోటార్ల సాయంతో బయటకు తోడుతున్నారు. నీటమునిగిన వరి పనలు మొలకెత్తకుండా ఉప్పునీరు పిచికారీ చేస్తున్నారు. తుపాన్ కారణంగా ఎకరానికి సుమారు రూ.25 వేల నుంచి రూ.30వేల వరకు నష్టం వాటిల్లింది. నీట మునిగిన వరి చేతికందదని రైతులు తీవ్రంగా కలత చెందుతున్నారు. జిల్లాలో సుమారు 10వేల ఎకరాలలో వరిపంటకు నష్టం వాటిల్లిందని ప్రాథమిక అంచనా. అదేవిధంగా జిల్లాలో సుమారు 1.65 వేల ఎకరాలలో పత్తిపంటకు వర్షాల వలన నష్టం వాటిల్లింది.

పత్తి అమ్ముడుపోతుందా?

పత్తితీత రెండో దశలో ఉన్న తరుణంలో కురిసిన భారీ వర్షం పత్తిపంటను పూర్తిగా దెబ్బతీసింది. ఎకరాకు కనీసం నాలుగు క్వింటాళ్ల మేర, అంటే ఎకరాకు కనీసం రూ.30 వేల వరకు నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. వర్షాలకు తడిసి నల్లబడిన పత్తిని తీసేందుకు కూలీలు దొరికే పరిస్థితులు లేవు. ఎక్కువ కూలి చెల్లించి పత్తి తీయిస్తే దానిని వ్యాపారులు కొనుగోలు చేస్తారో లేదోననే అనుమానాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి. ఈ ఏడాది పత్తి ధర బహిరంగ మార్కెట్‌లో చాలా తక్కువగా ఉంది. దీంతో రైతులు సీసీఐ కేంద్రాలలో పత్తిని విక్రయిస్తున్నారు. వర్షాలకు తడిసిన పత్తిని సీసీఐ కొనుగోలు


బూర్గంపాడులో నీట మునిగిన వరి పనలు

చేయాలని రైతులు డిమాండ్ చేశారు.

మిర్చి రైతుపై పెనుభారం..

ఈ ఏడాది కూడా మిర్చి రైతులను కష్టాలు వీడటం లేదు. ఈ ఏడాది రైతులు సాగు చేసిన మిర్చి తోటలకు బొబ్బతెగుళ్ల ఆశించి తీవ్రంగా నష్టపరిచింది. కొందరు రైతులు తోటలను పీకేసి మళ్లీ మిర్చి తోటలను వేశారు. మిర్చి తోటలకు రైతులు అధిక పెట్టుబడులు పెట్టి సాగు చేశారు. ఎకరం మిర్చితోట సాగుకు ఇప్పటి వరకు రైతులు సుమారు రూ.80 వేల నుంచి లక్ష రూపాయల వరకు ఖర్చు చేశారు. ప్రస్తుతం మిర్చి తోటలు కాత దశలో ఉన్నాయి. ఈ తరుణంలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం మిర్చి తోటలను తీవ్రంగా నష్టపరిచాయి. భారీ వర్షాలకు మిర్చి తోటలు నేల కొరిగాయి. కాపు మీద ఉన్న మిరప మొక్కలు గాలివానకు విరిగిపోయాయి. మిర్చి రైతులు ఎకరాకు కనీసం రూ.50వేల నుంచి రూ.70 వేల వరకు


బూర్గంపాడులో పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

నష్టం వాటిల్లిందని వాపోతున్నారు.

నష్టం లెక్కల్లో లొసుగులు..

తుపాన్ కారణంగా వేలాది ఎకరాలలో రైతులు పంటలు నష్టపోతే వ్యవసాయ అధికారులు మాత్రం కేవలం వందల ఎకరాలలోనే నష్టం చూపిస్తున్నారు. ఏదో మొక్కుబడి పర్యటనలతో పంట నష్టం అంచనాలను సిద్ధం చేస్తున్నారు. భారీ వర్షాలతో మూడు రోజులుగా పంటలకు నష్టం జరుగుతుంటే వ్యవసాయశాఖ అధికారులు ఇప్పటి వరకు కొన్ని గ్రామాల వైపు కన్నెత్తి కూడా చూడలేదని రైతులు ఆరోపిస్తున్నారు. వరిపంట వర్షానికి చాప చుట్టి నీటమునిగితే ఇప్పటి వరకు వచ్చిన అధికారే లేడని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తక్షణమే ఆదుకోవాలి



తుపాన్ వల్ల పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి. పంట నష్టపోయిన రైతులు తక్షణమే పరిహారమందించి రైతులకు భరోసానివ్వాలి. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్రంగా పంట నష్టం సర్వేలు చేయాలి. మొక్కుబడి సర్వేలు చేసి రైతులకు అన్యాయం చేయవద్దు. రైతులను అన్నివిధాల ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణమే ప్రకటన చేయాలి.

–డి.పున్నంచంద్, ఎన్డీ నాయకుడు

నిలిచిన వంతెన పనులు

అశ్వాపురం: మండల పరిధిలోని గొందిగూడెంలో ఇసుకవాగుపై హైలెవల్ వంతెన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ.7 కోట్లు మంజూరు చేయగా.. పనులకు గత ఏడు నెలల క్రితం మే 29న రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయకుమార్, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు శంకుస్థాపన చేశారు. జూన్‌లో పనులు ప్రారంభించారు. ఆపై నెల రోజులకే వర్షాకాలం ప్రారంభమైంది. దీంతో పనులు నిలిపివేశారు. ఈ నేపథ్యంలో వర్షాకాలంలో రాకపోకలకు గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం వర్షాకాలం ముగిసి మూడు నెలలైనా వంతెన పనులు ప్రారంభించలేదు. వంతెన పనుల కారణంగా తాత్కాలికంగా వేసిన అప్రోచ్ రహదారి భారి వర్షం కురిస్తే రహదారి కొట్టుకుపోయి రాకపోకలకు గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల ముందు హడావుడిగా వంతెన పనులు ప్రారంభించి తర్వాత నిలిపివేశారని గిరిజనులు పేర్కొంటున్నారు. వర్షాకాలంలో ఇసుకవాగు కారణంగా సుమారు 20


నిలిచిపోయిన ఇసుకవాగుపై వంతెన పనులు

గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచి బాహ్య ప్రపంచానికి దూరమవుతారు. ఎన్నో ఏండ్లుగా గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. వంతెన నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించి వర్షాకాలం లోపు వంతెన పనులు పూర్తి చేయాలని గిరిజనులు కోరుతున్నారు. అధికారులు దృష్టి సారించాలని వేడుకుంటున్నారు.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి


రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తున్న రైతులు, కాంగ్రెస్ నాయకులు

మణుగూరుటౌన్: ఓ కాంట్రాక్టర్ అనధికారికంగా నిర్మించిన బ్రిడ్జి వల్ల వరద నీరు నిలిచిపోయి పంటలు నాశనమయ్యాయని బాధిత రైతులు గురువారం సంబంధిత అధికారులను ఫిర్యాదు చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్నారం, కమలాపురం రహదారి మీదుగా రాయిగూడెం ఇసుక ర్యాంప్ రేజింగ్ కాంట్రాక్టర్ అనధికారికంగా కోడిపుంజుల వాగుపై బ్రిడ్జి నిర్మించాడని, దీంతో మిచాంగ్ వల్ల వచ్చిన వరద నీరు బ్రిడ్జి దాటివెళ్లే వీలులేక పొలాలను ముంచాయని ఆవేదన వ్యక్తం చేశారు. మిరప, పత్తి, మొక్కజొన్న, మినుము ఇతర పంటలు మొత్తం 60 ఎకరాలకు పైగా నీటమునిగాయన్నారు. ఈ మేరకు రైతులు రెవెన్యూ, వ్యవసాయాధికారులకు ఫిర్యాదు చేశారు. కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవడంతో పాటు ఎకరాలకు రూ.2లక్షలకు పైగా పెట్టుబడి పెట్టిన తమకు న్యాయం చేయాలని విన్నవించారు. స్పందించిన ఏడీఏ తాతారావు పంటలను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ రామశివరావు తదితరుల పాల్గొన్నారు.

పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు..

అనధికారిక బ్రిడ్జితో రైతులకు నష్టం వాటిల్లిందని తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, వైస్ ఎంపీపీ కేవీరావులు రైతులతో కలిసి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా రైతులకు సదరు ఇసుక కాంట్రాక్టర్ నష్టపరిహారం కట్టించాలని, ఆరుగాలం కష్టపడిన రైతుకు న్యాయం చేయాలని సంబంధిత అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు పాల్గొన్నారు.

ఇందిరానగర్‌లో వైద్యశిబిరం


చర్లరూరల్: వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్రీధర్


చంద్రుగొండ: ఇందిరానగర్‌లో వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండ శివారు ఇందిరానగర్‌లోని కేసీఆర్ కాలనీలో గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కనకం తనుజ కాలనీవాసులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అవసరం ఉన్నవారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆమె పరసరాలను పరిశీలించారు. పరిశుభ్రత పాటించాలని వారికి సూచించారు. ఈ శిబిరంలో వైద్యసిబ్బంది యండి.ఇమాం, రమణమ్మ, శ్రీను పాల్గొన్నారు.

చర్లరూరల్: చర్ల మండలంలోని దేవానగరం గ్రామంలో కొయ్యూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం అసంక్రమిత వ్యాధుల పరీక్షల వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సుమారు 55 మందికి పరీక్షలు నిర్వహించి వారిలో బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులైన వారికి కావలసిన మందులను డాక్టర్ శ్రీధర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ రామ్ ప్రసాద్, ఎంఎల్‌హెచ్‌పీ స్వరూప, ఏఎన్ఎం, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: మున్సిపాలిటీ పరిధిలోని శేష గిరినగర్‌లో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో పీహెచ్‌సీ వైద్యాధికారి శివకుమార్ వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్యపరీక్షలు చేసి నివారణ మందులను పంపిణీ చేశారు. అనంతరం ఇంటింటి సర్వే చేసి ప్రజలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పీహెచ్‌సీలో టీ–హబ్ ద్వారా అన్ని రకాల రక్తపరీక్షలు నిర్వహిస్తున్నట్లు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రాంప్రసాద్, దమయంతి, సమ్మక్క, రవి, వినయ్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మంత్రిగా సీతక్క ప్రమాణ స్వీకారంపై హర్షం


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

గుండాల: ఆదివాసీ నాయకురాలు సీతక్కకు తెలంగాణ మంత్రివర్గంలో స్థానం కల్పించడంపై తుడుందెబ్బ మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. సీతక్కకు ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ భద్రాది కొత్తగూడెం జిల్లా కమిటీ మండల కమిటీ తరుపున శుభాకాంక్షలు తెలియజేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పూనం శ్రీనివాస్, వజ్జా ఎర్రయ్య, ఈసం సాంబయ్య, కల్తి మల్లయ్య, మోకాళ్ల కన్నయ్య, స్వర్ణబాక కిసాన్ రావు, మండల అధ్యక్షుడు గోవింద నరసింహారావు, మండల ప్రధాన కార్యదర్శిచింత వెంకటేశ్వర్లు, మొక్కల మహేందర్, కుంజసత్యం, మోకాళ్ల ప్రభాకర్, ఇరుప కృష్ణ, ఇరుప రాజేందర్, పూనం చంద్రశేఖరావు తదితరులు పాల్గొన్నారు.

పొంగులేటిని కలిసిన నాయకులు


మంత్రి పొంగులేటికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నామా శ్రీనివాసరెడ్డి

మణుగూరుటౌన్: పాలేరు ఎమ్మెల్యే, తెలంగాణ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డిని మణుగూరు మండల సీనియర్ నేత, మాజీ కార్మిక నేత గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. ఏజెన్సీ ఏరియాలో గిరిజనులకు, గిరిజనేతరులకు మధ్య చిచ్చు పెడుతున్న బీఆర్ఎస్ పాలనలో సాగుతున్న అహంకారపూరిత పాలనకు చరమగీతం పాడేందుకు క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలకు ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృత ప్రచారం చేసి.. పాయం వెంకటేశ్వర్లు గెలుపునకు కృషి చేశారంటూ అభినందించారు. పార్టీ గెలుపు కోసం కష్టపడిన ప్రతి నాయకుడికి, కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు.

ఆర్థిక సాయం అందజేత

చర్ల: మండలంలోని కలివేరు గ్రామపంచాయతీలోని బట్టీగూడెంలో ఇటీవల విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌లో పూరిళ్లు దగ్ధమయ్యి నిరాశ్రయురాలైన బూటారి జోగయ్య కుటుంబానికి సీపీఎం చర్ల మండల కమిటీ ఆర్థిక సాయం అందజేసింది. గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మండల కార్యదర్శి కారం నరేష్ మండల కమిటీ సభ్యులు మచ్చా రామారావు, బందెల చంటి, పామారు బాలాజీ, పాడుపుగంటి సమ్మక్క.. దుప్పట్లు, వంటసామగ్రి, నిత్యావసర వస్తువులతో పాటు తాత్కాలిక ఇంటి నిర్మాణానికి 4 రేకులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాధితులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని వారు కోరారు.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

మణుగూరురూరల్: మండలంలోని సాయినగర్‌లో ఉన్న శ్రీషిర్డీ సాయిబాబా ఆలయంలో సాయినాథునికి గురువారం సందర్భంగా ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. దాతల సహకారంతో ఆలయ కమిటీ వారు ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించి తరించారు. అన్నప్రసాద దాతను ఆలయ కమిటీ వారు శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దోసపాటి నాగేశ్వరరావు, సీహెచ్ బాలకేశవరావు, అర్చకులు పవన్ కుమార్ వర్మ, భక్తులు పాల్గొన్నారు.

‘దురుద్దేశంతో వేధిస్తున్నారు’

ములకలపల్లి: వైన్‌షాపుల్లో పనిచేస్తున్న తనను లైసెన్స్ హోల్డర్ నాగరాజు ద్వారా కొందరు వ్యక్తులు వేధిస్తున్నారని కమలాపురం గ్రామానికి చెందిన తోట సత్యప్రకాశ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జగన్నాథపురం వైన్‌షాపులో మద్యం మాయం విషయమై తనపై తప్పుడు ఆరోపణలు చేసి, పోలీస్‌స్టేషనల్లో ఫిర్యాదు చేశారని వాపోయారు. పోలీసులతో తనను కొట్టించి, బలవతంగా తప్పు ఒప్పుకునేలా చేశారని వాపోయాడు. ఈ విషయమై ఎస్సై సాయికిషోర్ రెడ్డిని వివరణ కోరగా.. విచారణ నిర్వహిస్తున్నామని తెలిపారు. వైన్ షాపులో సుమారు 12 లక్షలాది రూపాయల మద్యాన్ని మాయం చేసినట్లు సత్యప్రకాశ్ ఒప్పుకున్నాడని ఎస్సై తెలిపారు.

‘యూడైస్ ప్లస్’పై శిక్షణ


మణుగూరుటౌన్: యూడైస్ ప్లస్ ప్రక్రియను వివరిస్తున్న అధికారులు

మణుగూరుటౌన్: యూడైస్ ప్లస్ (యునైటెడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్) పోర్టల్‌లో ప్రతీ పాఠశాల, కళాశాల, వివరాలతో పాటు, విద్యార్థుల వివరాలు నమోదు చేయాలని ఎంఈఓ వీరాస్వామి పలు పాఠశాలల యాజమాన్యాలకు సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలతో పాటు, జూనియర్ కళాశాల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పాఠశాలకు సంబంధించిన ఉపాధ్యాయుల వివరాలను అనుసంధానం చేయడంతో పాటు విద్యార్థి జనరల్, ఎన్‌రోల్మెంట్, ఫెసిలిటీ ప్రొఫైల్ వివరాలు నమోదు చేయాలన్నారు. అదేవిధంగా పాఠశాలకు సంబంధించిన సౌకర్యాల పూర్తి వివరాలు నమోదు చేయాలని సూచించారు. దీనివల్ల పాఠశాలల్లోని లోటుపాట్లు సవరించుకునేందుకు, ప్రభుత్వం నుంచి సౌకర్యాల కల్పనకు వీలుంటుందని తెలిపారు. ఈ నెల 12వ తేదీలోగా అందరూ ఈ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. పాఠశాలల యాజమాన్యాలకు, ఉపాధ్యాయులకు వీ.కోటేశ్వరరావు యూడైస్ ప్లస్‌పై అవగాహన కల్పించారు.

దుమ్ముగూడెం: మండలంలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులకు మండల అభివృద్ధి కార్యాలయ సమావేశ హాల్‌లో యూడైస్‌ప్లస్, ఎఫ్ఆర్ఎస్ (ఆన్‌లైన్ నమోదు)లపై గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల నమోదు, హాజరు, పరీక్షా వివరాలు, పాఠశాల వివరాలు, బిల్డింగ్స్, మరుగుదొడ్లు, వంట గదులు మొదలగు వివరాలు, విద్యార్థుల ముఖ గుర్తింపు వివరాలు తెలియజేయడంపై శిక్షణ ఇచ్చారు. యూడైస్‌ప్లస్ వల్ల ఉపయోగాలు తెలియచేశారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ ఏజే ప్రభాకర్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ ఆశీర్వాదం, సీఆర్పీలు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడు డుమ్మా..

అన్ని పాఠశాలలకు శిక్షణలు సాగుతున్న నేపథ్యంలో దుమ్ముగూడెం మండలంలోని సుబ్బారావుపేట గ్రామం ప్రాథమిక పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయుడు తిరుపతిరావు గురువారం పాఠశాల విధులకు హాజరు కాలేదు. లీవ్ లెటర్ పెట్టకుండా శిక్షణకు గాని, విధులకు గాని హాజరు కాలేదని తెలిసింది.

ములకలపల్లి: యూడైస్ ప్లస్ డేటా ఎంట్రీని ఈనెల 12వ తేదీలోగా విధిగా పూర్తి చేయాలని ఎంఈఓ శ్రీరామ్మూర్తి తెలిపారు. మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో గురువారం యూడైస్ ప్లస్ డేటా ఎంట్రీ, ఎఫ్ఆర్ఎస్ హాజరు తదితర అంశాలు ఆన్‌లైన్‌లో నమోదుపై గురువారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ మాట్లాడారు. డైటా ఎంట్రీ పక్కాగా నిర్వహించాలని సూచించారు. కాంప్లెక్స్ హెచ్ఎంలు, ఆర్పీలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్లలో తనిఖీ


భద్రాచలం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

భద్రాచలంఅర్బన్: డిప్యూటీ డెమో ఎండి.ఫాయాజ్ మోహియుద్దీన్ ఆధ్వర్యంలో గురువారం భద్రాచలం పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు స్కానింగ్ సెంటర్లు, డయాగ్నస్టిక్స్ సెంటర్లు, ఆస్పత్రుల్లో తనిఖీలు నిర్వహించారు. పలు రికార్డులను పరిశీలించారు. అర్హత కలిగిన వారు మాత్రమే పరీక్షలు నిర్వహించాలని వైద్యులు, సిబ్బందికి తెలియజేశారు. అనంతరం తనిఖీలకు సంబంధించిన నివేదికను జిల్లా వైద్యాధికారిని డాక్టర్ జేవీఎల్ శిరీషకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ బేబీ, జూనియర్ అసిస్టెంట్ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు


అశ్వారావుపేటరూరల్: బాణసంచా కాలుస్తున్న కాంగ్రెస్ శ్రేణులు


అశ్వాపురం: సంబురాలు జరుపుకుంటున్న నాయకులు, కార్యకర్తలు

దమ్మపేట: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి, మంత్రులుగా పొంగులేటి, తుమ్మల ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఘనంగా సంబురాలు జరుపుకున్నారు. గురువారం హైదరాబాద్‌లో రేవంత్, పొంగులేటి, తుమ్మల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని పురస్కరించుకుని, మండల కాంగ్రెస్ నాయకులు చిన్నశెట్టి యుగంధర్ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. మండల కేంద్రం దమ్మపేట గ్రామంలో కాంగ్రెస్ నాయకులు ఆనందోత్సాహాలతో భారీగా బాణసంచాను కాల్చారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు మిఠాయిలను పంచి, ఒకరికొకరు తినిపించుకున్నారు. జై కాంగ్రెస్, జై రేవంత్, జై పొంగులేటి, జై తుమ్మల అను నినాదాలతో మార్మోగిపోయేలా శబ్దాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు చిన్నశెట్టి యుగంధర్, పానుగంటి సత్యం, అత్తులూరి వెంకటరామారావు, చామర్తి గోపిశాస్త్రి, ఏసుమణి, పగడాల రాంబాబు, కక్కిరాల రమేష్, పందేటి వెంటేశ్వరరావు, చిన్నశెట్టి చిట్టిబాబు, పసుమర్తి కృష్ణారావు, కందుల వెంకటేశ్వరరావు, అత్యం శేఖర్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: తెలంగాణ రాష్ట్ర సీఎంగా రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎంగా భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులుగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుతోపాటు పలువురు గురువారం ప్రమాణ స్వీకారం చేయడం పట్ల గురువారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సంబురాలు జరిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ సెంటర్‌లో, మండలంలోని పాత నారంవారిగూడెంతోపాటు పలు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలంతా కలిసి కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు. అనంతరం పెద్ద స్థాయిలో బాణసంచాలు కాల్చి హర్షం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ అట్టం రమ్య, ఉప సర్పంచ్ రేమళ్ల కేదర్‌నాథ్, సొసైటీ చైర్మన్ చిన్నంశెట్టి సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యురాలు వేముల భారతి, నాయకులు మొగ్గళ్లపు చెన్నకేశవరావు, జూపల్లి ప్రమోద్, నండ్రు రమేష్, కేధార్‌నాథ్, అల్లాడి రామారావు, ప్రతాప్ పాల్గొన్నారు.

అశ్వాపురం: తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పదవి చేపట్టిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు బొబ్బాల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గురువారం సంబురాలు నిర్వహించారు. కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలు స్వీట్లు పంచి పెట్టి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు షర్ఫియుద్దీన్, నాయకులు చంద్రకళ, పాడియం అనిల్, వలబోజు మురళి నాయకులు, కార్యకర్తలు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభిమానులు పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించాలి

దుమ్ముగూడెం: మండలంలో మిచాంగ్ తుపాను వల్ల నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేలు ఇవ్వాలని సీపీఎం సీనియర్ నాయకుడు యలమంచిలి రవికుమార్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని మారాయిగూడెం, బీమవరం గ్రామాల్లో పత్తి, వరి, మిర్చి, అపరాలు, మొక్కజొన్న పంటలను సీపీఎం బృందం సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. తుపాన్ వల్ల మండలంలో తీవ్రంగా రైతులు నష్టపోయారని తక్షణమే ప్రభుత్వం సర్వే చేసి నష్టపరిహారం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చ వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి కారం పుల్లయ్య, జిల్లా కమిటీ సభ్యుడు యలమంచిలి వంశీ, మర్మంచం ద్రయ్య, సర్పంచ్ తొడం తిరుపతి రావు,రైతులు ఆప్కా రామకృష్ణ, అర్జున్, కారం శ్రీరాములు, సోడి రమణ, వెంకమ్మ, ప్రసాద్ పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: మిచాంగ్ తుపానుతో పంటలు నష్టపోయిన బాధిత రైతులను కొత్త ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొక్కెరపాటి పుల్లయ్య డిమాండ్ చేశారు. మండలంలోని పేరాయిగూడెం, గుర్రాల చెరువు, అల్లిగూడెం గ్రామాల్లో గురువారం రైతు సంఘం నాయకుల బృందం పర్యటించి తుపాను తాకిడికి గురై దెబ్బతిన్న వరి, మొక్కజొన్న, వేరుశెనగ పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భం మాట్లాడుతూ.. వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం మండలంలో వరి 500 ఎకరాలు, వేరుశెనగ 800 ఎకరాలు, పత్తి, మొక్కజొన్న కలిపి 300 ఎకరాల్లో తుఫాను వల్ల పంటలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనాలు వేశారని అన్నారు. ఈ పంటలు అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి సమగ్ర వివరాలు నమోదు చేయాలన్నారు. అలాగే ప్రజాప్రతినిధులు సందర్శించి రైతులకు భరోసా కల్పించాలని కోరారు.కార్యక్రమంలో నాయకులు బి.చిరంజీవి, సోడెం ప్రసాద్, తగరం జగన్నాథం, కలపాల భద్రం ఉన్నారు.


దుమ్ముగూడెం: తడిసిన వరి పంటను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

చంద్రుగొండ: మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం సీపీఎం అనుబంధ రైతుసంఘం నాయకులు క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టం వాటిల్లిన పంటలను పరిశీలించారు. పత్తి, మిర్చిపంటలతోపాటు వరిపంటను పరిశీలించిన నాయకులుజజ ప్రభుత్వం సత్వరమే స్పందించి రైతులను ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. పర్యటనలో సంఘం నాయకులు ఐలూరి రామిరెడ్డి, విప్పర్ల వెంకటేశ్వర్లు, రాయి రాజా, అబ్దుల్ రహెమాన్ తదితరులు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి: తుఫాన్ ప్రభావంతో జిల్లాలో దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రంగాకిరణ్ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని కట్టుగూడెం గ్రామంలో వర్షానికి తడిసిన వరిధాన్యాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. తుఫాన్‌తో భారీ వర్షం కురిసి చేతికి వచ్చిన పంటలు దెబ్బతిన్నాయన్నారు. పంటలు నష్టపోయిన అన్నదాతలను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు. ఆయన వెంట ఆ పార్టీ నాయకులు నరేంద్రబాబు, శ్రీనివాస్, పైడిపాటి రవీందర్, జట్టంగి కృష్ణ, దూదిమెట్ల విజయ్, జుబ్బురు రమేష్, బాల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పరిశీలించిన వ్యవసాయ అధికారులు..

అశ్వారావుపేటరూరల్: మిచాంగ్ తుపానుతో దెబ్బతిన్న పంటలను గురువారం వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు. మండలంలోని పాపిడిగూడెం, గుమ్మడవల్లి, రెడ్డిగూడెం, ఊట్లపల్లి, అల్లిగూడెం, పేరాయిగూడెం, అశ్వారావుపేట ప్రాంతాల్లో ఏవో నవీన్ పర్యటించి ఆయా గ్రామాల్లో దెబ్బతిన్న వేరుశనగ, వరి, పత్తి, మిర్చి పంటలను పరిశీలించి వివరాలను నమోదు చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో పూర్తిగా వివరాలు సేకరిస్తున్నామని, నష్టపోయిన రైతుల వివరాలను ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట సొసైటీ చైర్మన్ చిన్నంశెట్టి సత్యనారాయణ, ఏఈఓలు రాయుడు, షాకిరా భాను ఉన్నారు.


అశ్వారావుపేటరూరల్: వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ నవీన్


అన్నపురెడ్డిపల్లి: ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రంగాకిరణ్